సాక్షి ప్రకాశం
శనివారం । 14 । జూన్ । 2025



వైభవంగా చక్రస్నానం

పామూరులో మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రస్నానం, ధ్వజావరోహణతో ముగిశాయి. - 8లో..



కేసులు కుట్రే

వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

21న పొదిలిలో మద్యం దుకాణానికి డ్రా

ఒంగోలు టౌన్: పొదిలి పట్టణంలోని 1వ నంబరు మద్యం దుకాణానికి ఈ నెల 21వ తేదీ డ్రా తీయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్లో కానీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించే డ్రాలో పాల్గొనాలని తెలిపారు.

తెనాలిలో పోలీసు హింసపై 14న విజయవాడలో సదస్సు

ఒంగోలు వన్‌టౌన్: తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై తెనాలికి చెందిన ఇద్దరు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు హింసాత్మకంగా దాడి చేసిన ఘటనపై ఈనెల 14న విజయవాడలో నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులపై హత్యాయత్నం చేశారనే కట్టుకథతో ముగ్గురు దళిత, ముస్లిం యువకులపై గంజాయి బ్యాచ్‌గా ముద్ర వేసి తెనాలి, టూటౌన్ సీఐ రాముల నాయక్, త్రీటౌన్ సీఐ రమేష్ బాబులు తాలిబన్ల తరహాలో అనాగరికంగా, బహిరంగంగా కొట్టారన్నారు. దీనిని సమర్థిస్తూ హోం మంత్రి మాట్లాడారన్నారు. యువకులపై తెలుగుదేశం పార్టీ, కూటమి పార్టీ నాయకులు మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతోనే రౌడీషీట్లు నమోదు చేశారన్నారు. ఈ ఘటనపై శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఈ సంఘటనపై సదస్సు జరుగుతుందని చెప్పారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు పరిశీలించిన ఢిల్లీ బృందం



పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

దర్శి (కురిచేడు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామీణాభివృద్ధి శాఖ న్యూఢిల్లీ ప్రతినిధులు దిశ జాయింట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్ రామ్, అకౌంట్స్ ఆఫీసర్ జీఎస్ రావత్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీ జోసఫ్ కుమార్ లు శుక్రవారం దర్శి మండలంలో పర్యటించారు. పలు పనులను వారు తనిఖీ చేశారు. వారు ఈ నెల 8 నుంచి 14 వరకు జిల్లాలో పలు మండలాల్లో వారు పనులను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం దర్శి మండలంలోని యర్ర ఓబనపల్లి పంచాయతీలో రైతు పంట కుంటను, హార్టీకల్చర్ ప్లాంటేషన్ బత్తాయి తోటను పరిశీలించారు. పంట కాలువ పూడికతీత పనిలో ఉపాధి కూలీలతో ముఖాముఖి అయి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే పశువుల షెడ్డు నిర్మాణం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహాలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు వారి ఆర్థిక ఆదాయ పెరుగుదల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్ కృష్ణమూర్తి, దర్శి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ లలితకుమారి, ఏపీఓ బీ మురళి, ఏపీఎం షేక్.రజియా సుల్తానా, ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యో్యారు!

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ అంతా గందరగోళంగా మారింది. తొలుత ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రారంభంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఆ తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు మాన్యువల్ కౌన్సెలింగ్ కోసం ఆందోళన చేశారు. తాజాగా నిబంధనలకు విరుద్ధంగా అధికారులు బదిలీలు చేస్తున్నారంటూ పలు ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. కనీసం పాఠశాలను కోరుకునేందుకు అవకాశం ఇవ్వడంలేదని ఆరోపిస్తున్నాయి. ఖాళీ ఉన్నచోట తీసుకో అంటూ హుకుం జారీ చేస్తున్నారని, స్పౌజ్ ఆప్షన్ ఉన్నవారినీ ఇలానే బెదిరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పోస్టింగ్ ఇచ్చాం.. వెళ్లండి

- ఎస్జీటీల బదిలీల్లో నిబంధనలకు తూచ్
- ఏక పక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు
- బదిలీలకు 3148 మంది దరఖాస్తు
- ఉపాధ్యాయులకు ఆప్షన్ ఇవ్వని అధికారులు
- స్పౌజ్ ఆప్షన్ ఉన్నవారికీ అన్యాయం అంటూ ఆరోపణలు
- ఇప్పటి వరకూ 1800 వరకూ కౌన్సెలింగ్
- అధికారుల తీరుపై మండిపడుతున్న యూనియన్లు

ఒంగోలు సిటీ:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీచర్ల బదిలీల ప్రక్రియ అంతా గందరగోళంగా మారింది. తొలుత ప్రధానోపాధ్యాయుల బదిలీలు గత నెల మే 21వ తేదీన ప్రారంభమయ్యాయి. తొలి రెండు రోజులు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. 141 మంది బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మాన్యువల్‌గా నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందంటూ రెండు రోజులు ఆందోళన చేశారు. ప్రభుత్వం కొన్ని మార్పులు చేయడంతో మంగళవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే రెండు ఉపాధ్యాయ సంఘాల మధ్య వివాదం తలెత్తడంతో బుధవారం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. బదిలీలకు సంబంధించి ఎస్జీటీలు సుమారు 3148 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో స్పౌజ్ ఆప్షన్ కింద 515 మంది దరఖాస్తు చేసుకున్నారు. నగరంలోని పాత జెడ్పీ సమావేశ మందిరంలో బదిలీలను నిర్వహిస్తున్నారు. 11వ తేదీ తొలి 600 మందికి, 12వ తేదీ 601 నుంచి 1300 వరకూ, 14వ తేదీ 1301 నుంచి 1800 వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. స్పౌజ్ ఆప్షన్ కింద దరఖాస్తు చేసుకున్న 515 మందిలో 416 మందికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు.

బదిలీల్లో ఇష్టారాజ్యం

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా కౌన్సెలింగ్‌లో ఖాళీలు చూపించిన తర్వాత ఆ ఉపాధ్యాయుడు తనకు అనుకూలమైన స్థానాన్ని ఎంచుకునే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం జరుగుతున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల్లో అధికారులు అందుకు భిన్నంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నుంచి బదిలీలను పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు ఉన్నా అవేమీ తమకు కాదన్నట్లుగా జిల్లా విద్యాశాఖాధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక ఉపాధ్యాయుడు బదిలీల కౌన్సెలింగ్ సమయంలో కంప్యూటర్ ద్వారా డిస్‌ప్లే చేస్తున్న ఖాళీలను పరిశీలించి తనకు ఇష్టమైన స్థానాన్ని ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉంది. కానీ అందుకు భిన్నంగా బదిలీల కౌన్సెలింగ్‌లో సంబంధిత అధికారే తాను సూచించిన స్థానానికి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారని పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. అధికారుల తీరుపై ఉపాధ్యాయులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ పోరాడి సాధించుకున్నామన్న తృప్తి లేకుండా పోయిందని వాపోతున్నారు. ఏ శాఖలోనైనా ఉద్యోగుల బదిలీలు జరుగుతుంటే ఆ శాఖలో ఉన్న ఖాళీలను చూపించి ఆప్షన్లు పెట్టించుకుంటారు. కానీ ఉపాధ్యాయ బదిలీల్లో మాత్రం ఉపాధ్యాయులు ఆప్షన్లు పెట్టుకున్నా అవేమీ చెల్లుబాటు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాము పారదర్శకంగా బదిలీలు చేస్తున్నామని పైకి చెబుతున్నా అంతర్గతంగా ఏదో మతలబు ఉందనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది నిర్వహించిన రేషనలైజేషన్లో ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు బదిలీపై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత బదిలీల్లో అటువంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు ఒకే చోట పనిచేసేందుకు పిల్లలు ఎక్కువ మంది ఉన్న పాఠశాలలను గుర్తించి ఆప్షన్లు పెట్టుకున్నారు. దరఖాస్తు చేసుకున్న ఆప్షన్లకు భిన్నంగా ఫలానా మండలంలో ఫలానా పాఠశాలలో ఖాళీగా ఉంది. అక్కడకు వెళ్లండి అంటూ బహిరంగంగా చెప్పుండటంతో ఉపాధ్యాయులు కూడా ఏమీ మాట్లాడలేని పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక ఎత్తు అయితే మరో వైపు స్పౌజ్, అనారోగ్య కారణాలు, దీర్ఘకాలిక వ్యాధులు, వివిధ కేటగిరీల్లోని ఉపాధ్యాయుల పరిస్థితి కూడా ఇదే విధంగా మారింది. కొంత మంది ఉపాధ్యాయులు స్పౌజ్ కేటగిరీలో తమకు అనుకూలమైన పాఠశాలలను ఎంపిక చేసుకోకుండా అధికారులే స్థానాలు కేటాయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమకు అనుకూలమైన ప్రాంతాల్లోని పాఠశాలను ఎంపిక చేసుకోకుండా అధికారులు కేటాయించిన స్థానాల్లో తాము చేరితే భవిష్యత్‌లో ఆ పాఠశాలలకు రేషనలైజేషన్లో పోస్టులు పోతే తమ పరిస్థితి ఏమిటని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. ఒక మహిళా టీచర్ అనారోగ్యరీత్యా తనకు అనుకూలమైన స్థానాన్ని కోరుకుంటే అవేమీ పట్టించుకోకుండా పక్క జిల్లాకు వెళ్లాలని అంటున్నారని, ఈ బదిలీలు ఎంత పారదర్శకంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చంటున్నారు.

342 బేళ్లు తిరస్కరణ



టంగుటూరు వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 202 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకి చెందిన రైతులు 841 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 639 బేళ్లు కొనుగోలు చేశారు. 202 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి రూ.239.49 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

140 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 140 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెట్లూరు జగ్గరాజుపాలెం ఎమ్.ఎస్ కండ్రిక, వర్ధినేనివారి పాలెం గ్రామాలకు చెందిన రైతులు 762 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 622 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 140 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.180, సరాసరి ధర కేజీ రూ.251.73 గా నమోదైంది. వేలంలో 20 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.



కొండపి వేలం కేంద్రంలో..

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కూటమి

- కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలం
- సూపర్ సిక్స్ అమలు చేయకపోవడంతో నమ్మకం కోల్పోయిన కూటమి
- వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి సంపద ఎలా సృష్టిస్తారని ప్రశ్న
- మహిళలకు నెలకు రూ.1500 ఎప్పుడిస్తారంటూ నిలదీత
- ఏడాది కూటమి పాలనపై పుస్తకాన్ని ఆవిష్కరించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి



కూటమి పాలనపై సీపీఎం ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు రమాదేవి

ఒంగోలు టౌన్: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్నీ విధాలుగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి స్పష్టం చేశారు. మంచి పరిపాలన అందిస్తున్నట్లు కూటమి పాలకులు చెప్పుకుంటూ తిరుగుతున్నారని, అయితే ప్రజలు మాత్రం కూటమి పాలన పట్ల సంతృప్తిగా లేరని కుండబద్దలు కొట్టారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం కూటమి ఏడాది పాలనపై ప్రచురించిన పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ అందిస్తారని ఆశించిన ప్రజలు గత ఎన్నికల్లో కూటమికి భారీ మెజారిటీతో గెలిపించారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ పథకాలలో ఆడబిడ్డ పథకం కింద 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయకుండానే సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆడబిడ్డ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలలో మహిళల ఆర్థిక స్వాలంబనకు సాయం అందించినట్లు కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందని మహిళలు నమ్మకం పెట్టుకున్నారని చెప్పారు. దాన్ని వదిలేసిన చంద్రబాబు పీ 4 గురించి మాట్లాడుతున్నారని, ఎవరికై తే అవసరమో వారికి పీ4 అమలు చేస్తామని చెప్పడం మాట మార్చడమేనన్నారు. పీ4 పేరుతో కార్పొరేట్ కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేయడం మహిళలను మరోసారి మోసగించడమేనని మండిపడ్డారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చారని చెప్పారు. దీంతో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా ఇస్తామని చెప్పి దాని గురించి కనీసం ప్రస్తావించడం లేదని, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి సంపదను ఎలా సృష్టిస్తారని ప్రశ్నించారు. విత్తనాలు, పురుగు మందులు సబ్సిడీకి ఇవ్వలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. పొగాకు కొనుగోలు జరగక, రైతులకు గిట్టుబాటు ధరలు లభించక ఆందోళన చెందుతున్నారని, బర్లీ పొగాకుకు సరైన గిట్టుబాటు ధర రాక రైతులు అప్పుల పాలయ్యారన్నారు. రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ విధానాన్ని కూటమి పాలకులు దెబ్బ తీశారని విమర్శించారు. పుస్తకావిష్కరణలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్, పూనాటి ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, జీవి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం హైస్కూల్‌కు ఎగనామం

బేస్తవారిపేట: తల్లికి వందనం పథకం అమలు తీరులో సర్కారు డొల్లతనాన్ని బట్టబయలు చేసిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్లలో వెలుగుచేసింది. హాజరు శాతం, ఇతర కారణాలతో ఇప్పటికే విద్యార్థుల సంఖ్యను కుదించేందుకు ప్రయత్నించిన ప్రభుత్వం బేస్తవారిపేట మండలంలో ఏకంగా ఓ పాఠశాలనే తల్లికి వందనం పథకానికి దూరం చేయడం సంచలనం సృష్టించింది. పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్‌లో మూడో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 134 మంది ఉన్నారు. పిటికాయగుళ్ల సచివాలయం పరిధిలోని ప్రాథమిక పాఠశాల, బయటి ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి ఫైనల్ ఎలిజిబుల్, ఇన్ ఎలిజిబుల్ జాబితాలు వచ్చాయి. ఈ జాబితాలో హైస్కూల్‌లో చదువుతున్న 134 మంది విద్యార్థుల వివరాలు లేవు. జాబితాను సరిచూసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు హైస్కూల్ హెచ్‌ఎం భాస్కరరావు ప్రశ్నించారు. మాకు ఏమీ తెలియదు, పైనుంచే జాబితాలను సచివాలయాలకు పంపారని, తాము ఎటువంటి జాబితాను పంపలేదన్నారు. బేస్తవారిపేటలోని ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యను తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



పిటికాయగుళ్ల సచివాలయం



నారసింహుని కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నారసింహుని రథోత్సవం

నమో నారసింహా..

- కన్నుల పండువగా కళ్యాణోత్సవం, రథోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం స్వామి వారి కళ్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. ఈ కళ్యాణోత్సవానికి మంత్రి స్వామి రాలేకపోవటంతో ప్రభుత్వం తరఫున పంపిన పట్టు వస్త్రాలను మంత్రి తరఫున స్వామి వారికి అందజేసినట్లు దేవస్థాన ఈఓ పీ కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా భక్తులకు స్వామి వారి తలంబ్రాల బియ్యాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం గ్రామ వీధుల్లో వైభవంగా జరిగింది. స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ఉంచి ఊరేగించారు. రథోత్సవంలో ఎటువంటి అపశ్రుతులు జరగకుండా సీఐ సీహెచ్ హాజరత్తయ్య, ఎస్సై బీ మహేంద్ర చర్యలు తీసుకున్నారు. కళ్యాణోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ఆర్యవైశ్యులు, శ్రీ కృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్, బ్రాహ్మణ సంఘాల వారు అన్నదానం నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, అనిల్ కుమార్ యాదవ్



వేదికపై మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కూటమి పాలనలో అక్రమ కేసులు పెట్టడం , దాడులు చేయటం పరిపాటిగా మారిందన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయకుండానే అన్నీ చేశామని చెప్పటం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ పార్టీని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, కానీ పార్టీ నాయకులు, కార్యకర్తలు గోడకు కొట్టిన బంతిలా అణగదొక్కే కొద్దీ ఉవ్వెత్తున లేస్తున్నారని, పార్టీ మరింత బలోపేతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి సాయికోటి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు దాసరి శేషయ్య, మాదాల శంకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లికి వందనం కాదు.. వంచన పథకం

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అమ్మ ఒడి పథకానికి కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంగా పేరు మార్చి దాని అమలులో తల్లులను నిలువునా వంచిస్తోందని పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. డాక్టర్ సురేష్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం అధికారికంగా చదువుతున్న విద్యార్థుల సంఖ్య 87,41,885 మంది ఉండగా 67,27,164 మంది విద్యార్థులకు రూ.10 వేల 90 లక్షల 74 కోట్లకు మాత్రమే పరిపాలన అనుమతులు వచ్చాయి. కానీ ఇప్పుడేమో 54,94,703 మందికి ఒక్కొక్కరికి రూ.13 వేలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం ముందు ఎంతమందికి తల్లికి వందనం డబ్బులు జమ చేస్తుందో అంతుచిక్కకుండా ఉందని, చివరికి ఇది వంచన పథకంగా మిగిలిపోయే అవకాశం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

హత్య కేసు కొట్టివేత

మార్కాపురం: హత్య కేసులో నేరం రుజువు కానందున కేసు కొట్టివేస్తూ మార్కాపురం ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శుభవాణి శుక్రవారం తీర్పు వెల్లడించారు. నిందితుడి తరఫున కేసును వాదించిన న్యాయవాది మొఘల్ అన్వర్‌బేగ్ కథనం ప్రకారం.. మార్కాపురం పట్టణానికి చెందిన ఒంగూరి చెన్నయ్య, నాగెళ్ల సౌజన్యకు సుమారు 20 ఏళ్ల క్రితం క్రైస్తవ మత సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. వారికి ఒక అమ్మాయి, అబ్బాయి సంతానం. సౌజన్య ఓ ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేసేది. భార్యాభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో 2018 ఏప్రిల్ 25న ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అదే రోజు రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో ఇంటి పై పోర్షన్‌లో అత్త, మరిది, తోడు కోడలుతో కలిసి నిద్రిస్తున్న సౌజన్యపై చెన్నయ్య దాడి చేయడంతో, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిందని ఆమె తల్లి విమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నిందితునిపై నేరం రుజువు కానందున న్యాయమూర్తి కేసును కొట్టివేస్తూ తీర్పుచెప్పారని న్యాయవాది పేర్కొన్నారు.

దివ్యాంగ బాలుర హాస్టల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలులోని ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహంలో విద్యార్థులకు ఉచిత భోజన, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి నెలా నిబంధనలను అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుందని, అవసరమైన దివ్యాంగులకు వారి సౌలభ్యం కోసం ప్రత్యేక సహాయకుడిని నియమిస్తామని వివరించారు. 2025–26 విద్యా సంవత్సరానికిగాను ఒకటో తరగతి నుంచి 12వ తరగతి ఆపై ప్రత్యేక కోర్సులు, తరగతులు చదువుకునే దివ్యాంగులు అర్హులని స్పష్టం చేశారు. శారీరక అంగవైకల్యం, పాక్షిక అంధత్వం, పాక్షిక వినికిడి లోపం కలిగి, ప్రభుత్వ వైద్యశాల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన బాలురు ఈ వసతి గృహంలో ప్రవేశాలకు అర్హులని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఇంటర్ విద్యార్థులకు సొంత ఖాతాల్లోనే నగదు జమ

ఒంగోలు వన్‌టౌన్: తల్లికి వందనం నిధులు 9, 10వ తరగతి విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లి ఖాతాకు జమ చేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వారి సొంత బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఆధార్ నంబర్‌ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బ్యాంక్ ఖాతా లేనివారు కొత్తగా నమోదు చేసుకోవడంతోపాటు అందరూ ఈ నెల 16వ తేదీలోగా ఎన్‌పీసీఐకి అకౌంట్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని స్పష్టం చేశారు. కళాశాలల కోఆర్డినేటర్లు, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులు ఎన్‌పీసీఐ పోర్టల్‌లో బ్యాంక్ ఖాతాలను అనుసంధానం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు.

‘పచ్చ’ పైత్యం.. ప్రచార కండూతి!



రాచర్ల గ్రామ సచివాలయం



కాంట్రాక్టర్ పేరు తొలగించి కొత్తగా ఏర్పాటు చేసిన శిలాఫలకం

రాచర్ల(బేస్తవారిపేట): వైఎస్సార్ సీపీ హయాంలో పూర్తయిన పనులను తమ గొప్పలుగా చెప్పుకోవడానికి టీడీపీ నాయకులు ఏమాత్రం సంకోచించడం లేదు. ప్రచార కండూతి పెచ్చుమీరడంతో శిలాఫలకాలకు సైతం పసుపు రంగు వేయించి డప్పుసుకుంటున్నారని రాచర్ల వాసులు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ప్రజలకు పాలన చేరువ చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు భారీగా నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలోనే రాచర్లలో గ్రామ సచివాలయానికి రూ.43.60 లక్షలు కేటాయించగా.. నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఏలం మురళి చేపట్టారు. శంకుస్థాపన సమయంలో వేసిన శిలాఫలకంలో కాంట్రాక్టర్ మురళి పేరు ప్రచురించారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే ఈ సచివాలయ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గత 11 నెలలుగా సచివాలయాన్ని ప్రారంభించకుండా వదిలేసింది. ఎట్టకేలకు ఇటీవల సచివాలయాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇక్కడే స్థానిక టీడీపీ నాయకులు కుయుక్తులు ప్రదర్శించారు. కాంట్రాక్టర్ పేరు లేకుండా కొత్తగా మరో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం ఆనోటా ఈనోటా రాచర్ల ప్రజలకు తెలియడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.

దాడులు స్క్రిప్టే.. కేసులు కుట్రే!

- వైఎస్ జగన్‌కు లభిస్తున్న అశేష ప్రజాదరణతో చంద్రబాబులో వణుకు
- పథకం ప్రకారం పొదిలిలో టీడీపీ నాయకులతో రాళ్లు, చెప్పుల దాడి
- పోలీసుల సహకారంతో కక్ష సాధింపు చర్యలకు మరింత పదును
- ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరఫున పోరాడతాం
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- బెయిల్‌పై విడుదలై వచ్చిన కంభం మండల నాయకులకు పరామర్శ



బెయిల్‌పై విడుదలైన వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

కంభం: రాష్ట్ర ప్రజల్లో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న అశేష ప్రజాధరణను చూసి ఓర్వలేకనే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని గిద్దలూరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన పొగాకు రైతులకు మద్దతుగా పొదిలిలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించిన సందర్భంగా రైతులు, ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో కార్యక్రమం విజయవంతమైంది. టీడీపీ నేతలు ఊహించని రీతిలో జన సందోహం ఉండటంతో ఓ వైపు జగనన్న పర్యటన సాగుతుండగానే కుట్రలను అమలు చేశారని దుయ్యబట్టారు. ఉద్దేశపూర్వకంగానే నిరసన పేరుతో మహిళలను ముందుపెట్టి జగనన్న ర్యాలీపై రాళ్లు, చెప్పులు విసిరారని, పోలీసులు మాత్రం వైఎస్సార్ సీపీ నాయకులపైనే కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు.

కంభం మండలం కందులాపురం గ్రామానికి చెందిన డి.సుబ్బారెడ్డి, సూరేపల్లికి చెందిన బిజ్జం వెంకట సుబ్బారెడ్డి(కన్నా), లింగోజిపల్లి గ్రామానికి చెందిన రావూరి చిన్నవెంకటరాజు చౌదరిపై కేసులు నమోదు చేయగా వారు బెయిల్‌పై విడుదలయ్యారు. శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కేపీ పార్టీ నాయకుల ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు. తమ తప్పు ఏమీ లేకపోయినా పోలీసులు కేసులు నమోదు చేశారని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప వద్దకే సంక్షేమ పథకాలు చేరేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ఘోరంగా విఫలమైన నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటానికి దిగారని, వాటిని అడ్డుకోవడమే లక్ష్యంగా పోలీసుల సహాయంతో అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టేట్ మైనారిటీ వింగ్ సెక్రటరీ ఎం.గఫార్ అలీ, కంభం, బేస్తవారిపేట మండల అధ్యక్షులు గొంగటి చెన్నారెడ్డి, శ్రీధర్ రెడ్డి, నాయకులు చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రసూల్, సయ్యద్‌ఖాసిం, సయ్యద్ సలీం, పెద్ద కోటేశ్వరరావు, ఆనంద్, సుభాష్, రఫీ, సబ్బసాని సాంబశివారెడ్డి, హుస్సేన్‌బాషా, చిన్న చెన్నారెడ్డి, బాలిరెడ్డి, నెమలిదిన్నె సతీష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బొల్లు రాములు, వెంకట సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, జగన్, చప్పిడి రాములు, బత్తిని రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై పెట్టినవి అక్రమ కేసులే

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు చేసిన పర్యటనను భగ్నం చేసేందుకు ప్రయత్నించిన కూటమి ప్రభుత్వ సానుభూతిపరులను వదిలి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కుట్ర పూరితంగా కేసులు బనాయించటం దారుణమని, అవి ముమ్మాటికీ అక్రమ కేసులేనని పార్టీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. దీనిపై న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తానని ఆయన హెచ్చరించారు. డాక్టర్ సురేష్ మీడియాతో మాట్లాడుతూ పొదిలిలో జగనన్న పర్యటనకు కనీవినీ ఎరుగని రీతిలో పార్టీ సానుభూతిపరులు, గిట్టుబాటు ధర లేక నష్టాల పాలైన పొగాకు రైతులు వేలాదిగా తరలి వస్తే చూస్తూ ఓర్వలేని కూటమి ప్రభుత్వ పెద్దల కుట్రలో భాగంగా కూటమి నాయకుని ఇంటి వద్ద నుంచే ప్రజలపై సీసాలు, రాళ్లు వేసి బీభత్సం సృష్టించారన్నారు. వారిని పోలీసులు వదిలేసి తమ అభిమాన నాయకుని చూడటానికి వచ్చిన పార్టీ సానుభూతిపరులపై కేసులు బనాయించటం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కూటమి ప్రభుత్వ పెద్దలను కుట్రకోణంలో విచారించకుండా ప్రతిపక్ష పార్టీకి చెందిన సానుభూతిపరులపై పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని కేసులు బనాయించటం దారుణమన్నారు. ఈ విధంగా పోలీసులు ప్రభుత్వంలో ఉన్న పార్టీకి కొమ్ముకాయటం మంచి సాంప్రదాయం కాదన్నారు. పొదిలి ఘటనపై పోలీసులు నిష్పార్థంగా విచారించి అమాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ఘటనను ఏ సీసీ ఫుటేజ్‌లో చూసి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కేసులు బనాయించారో పోలీసు పెద్దలు చెప్పాలని, ఆ సీసీ ఫుటేజ్‌ని బహిరంగ పరచాలని సూచించారు. పోలీసులు తమ ఇష్టం వచ్చినట్లు అక్రమ కేసులు బనాయిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మా పార్టీ సానుభూతిపరులకు అండగా ఉండి న్యాయం కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్ స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హేచరీ యాజమాన్యంపై కేసు



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఎస్సై, లేబర్ ఇన్స్‌పెక్టర్

ఉలవపాడు: హేచరీలో పనిచేస్తున్న బాల కార్మికుడికి గాయాలు కావడంతో యాజమాన్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా వయకరంపల్లి మండలం ఈదటం గ్రామానికి చెందిన ఓ బాలుడు పదోతరగతి చదువుతున్నాడు. తన స్నేహితుడు నాగేష్ మండల పరిధిలోని అలగాయపాలెం వద్ద ఉన్న శ్రీనివాస హేచరీలో పనిచేస్తున్నాడు. అతనితో పాటు సెలవులలో పని చేయడానికి మే 3వ తేదీన వచ్చాడు. ఈ నెల 27వ తేదీన రొయ్య పిల్లలు పెంచే ట్యాంకులు శుభ్రం చేసి యాసిడ్ బకెట్‌తో నిచ్చెన దిగుతున్న సమయంలో నిచ్చెనపై నుంచి పడి తలకు బలమైన గాయమైంది. దాంతో పాటు బకెట్‌లో ఉన్న యాసిడ్ కళ్లలో పడి మంటలు రావడంతో కందుకూరులోని పంటవారిపాలెంలో చూపించి ఇంటికి పంపించారు. ఇంటికి వెళ్లిన తరువాత వారి తల్లితండ్రులు తుని హాస్పిటల్‌లో స్కానింగ్ తీసి ఆపరేషన్ చేయాలని చెప్పారు. తుని వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా లేబర్ ఇన్స్‌పెక్టర్ సుజాత, ఎస్సై అంకమ్మ వెళ్లి ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. 18 ఏళ్ల లోపు బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు హేచరీ యాజమాన్యం పై కేసు నమోదు చేశారు. ఇంకా ఎవరైనా బాల కార్మికులు ఉన్నారా అని తనిఖీ చేశారు.


భక్తితో అభిషేకం వైభవంగా చక్రస్నానం

- నగర సంకీర్తన, హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు
- ధ్వజ అవరోహణతో ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ధ్వజ అవరోహణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

పామూరు: మండల కేంద్రమైన పామూరులో ఈ నెల 5న ప్రారంభమైన మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రస్నానం, ధ్వజ అవరోహణ కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు నారాయణం సత్యబాబుస్వామి, గోపాలాచార్యులు స్వామివార్ల మూలవిగ్రహ, ఉత్సవ మూర్తులకు హోమం, విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ రుక్మిణి, సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకం చేసిన అనంతరం చక్రస్నానం నిర్వహించారు. నగర సంకీర్తన, రాత్రికి స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఏకాంత సేవ భక్తి శ్రద్ధలతో సాగాయి. పూజా కార్యక్రమాల్లో కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ దంపతులు, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, బండ్లా నారాయణ తదితరులు పాల్గొన్నారు. సీఐ ఎం.భీమానాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



వేదమంత్రాలతో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్ర హోంమంత్రి వ్యాఖ్యలు చట్ట విరుద్ధం

చీరాల రూరల్: తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై తెనాలి 2, 3 పట్టణ సీఐలు జరిపిన తాలిబన్ దాడిని ఖండిస్తున్నామని, అందుకు బాధ్యులైన ఇద్దరు సీఐలను అరెస్టు చేయాలని, పోలీసులు కొడితే తప్పేముందన్న రాష్ట్ర హోంమంత్రి అనితను పదవి నుంచి తొలగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దళిత మహాసభ రాష్ట్ర నాయకుడు మాచవరపు జూలియన్‌తో కలసి దళిత మహాసభ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రౌడీషీటర్ల పేరుతో దళిత, ముస్లిం యువకులను నడిరోడ్డుపై బహిరంగంగా అందరూ చూస్తుండగా లాఠీలతో ఇష్టానుసారంగా కొట్టి హింసించడం దారుణమన్నారు. తెనాలిలో దళిత యువకులను రౌడీషీటర్లు అంటున్న హోంమంత్రి అనిత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలసి ఒంగోలులో తెలుగుదేశం పార్టీకి చెందిన వీరయ్య చౌదరి అనే మాజీ రౌడీషీటర్ వీరయ్య చౌదరి అంత్యక్రియలకు ఏవిధంగా హాజరయ్యారో చెప్పాలని డిమాండ్ చేశారు. నేరాలకు కులం, మతం ఉండదన్న హోంమంత్రి అమరావతి మహిళల అవమానం కేసులో జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయించడానికి ఎస్సీ, ఎస్టీ కేసు ఎందుకు పెట్టించారని ప్రశ్నించారు. న్యాయమూర్తి జిల్లా ఎస్పీని, డీఎస్పీని మందలించి ఎస్సీ, ఎస్టీ కేసును తొలిగించింది నిజమా కాదా హోంమంత్రి చెప్పాలన్నారు. కరోనా సమయంలో చీరాలలో దళిత యువకుడు కిరణ్‌కుమార్‌ను మాస్కు పెట్టుకోలేదనే నెపంతో అప్పటి టూటౌన్ ఎస్సై కొట్టగా చనిపోయాడని, అందుకు ఎస్సైని హత్యానేరం కింద అరెస్టుచేసి రిమాండుకు తరలించింది నిజం కాదా అని ప్రశ్నించారు. రేణంగివరం పోలీసు స్టేషన్లో జె.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన మాదిగ యువకులని పోలీసు స్టేషన్‌లోనే కొట్టి హింసించిన కేసులో ఒంగోలు ఎస్సీ, ఎస్టీ కోర్టు ఎస్సై జగన్మోహనరావుకు రెండేళ్ల శిక్ష విధించిందన్నారు. పోలీసులు కొట్టే హక్కు ఉంటే కోర్టులు ఎందుకు శిక్షలు విధించాయో హోం మంత్రి సమాధానం చెప్పాలన్నారు. కోర్టులు విధించిన శిక్షలను హోంమంత్రి రద్దు చేయించగలరా అని ప్రశ్నించారు. తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై దాడికి పాల్పడిన సీఐలపై అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని, హోంమంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు దారా అంజయ్య, కాకుమాను రవి, షేక్ జిలాని పాల్గొన్నారు.

శభాష్.. థామస్

- 33 ఏళ్లలో 75సార్లు రక్తదానం
- ఒక్క రెడ్‌క్రాస్‌లోనే 35 పర్యాయాలు..
- 20 ఏళ్ల వయసులో తల్లికి తొలిసారి రక్తదానం
- 3 రోజుల పాపకు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన థామస్
- నేడు అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న మక్కెన థామస్(ఫైల్)

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడమంటే సాటి మనిషికి ప్రాణం పోసినట్లే.! ఒకసారి రక్తదానం చేయడానికే జంకుతున్న రోజులివి. అలాంటిది ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 75 సార్లు రక్తదానం చేసి ఎందరికో ఆపద్బాంధవుడిగా నిలిచాడు మక్కెన థామస్. అరుదైన ఏ పాజిటివ్ ఏ2 సబ్ బ్లడ్ గ్రూపు కలిగిన థామస్ కూడా చాలా అరుదైన వ్యక్తే అని చెప్పవచ్చు. ఇలాంటి వ్యక్తులు నూటికో కోటికో ఒక్కరు ఉంటారు. ఆ మనకెందుకులే అనుకోకుండా ముందడుగు వేస్తుంటారు. థామస్ పుట్టి పెరిగింది జిల్లాలోని దొనకొండ. తండ్రి జయపాల్‌రావు ఎన్‌ఎస్పీ ఉద్యోగి కావడంతో ఒంగోలుకు వచ్చిన ఆ కుటుంబం ఇక్కడే స్థిరపడిపోయింది. ప్రస్తుతం థామస్ తన తల్లిపేరుతో ఎంఎంఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి మక్కెన మరియ రోజీకి తొలిసారిగా రక్తదానం చేశారు. అప్పుడు ఆయన వయసు 20 ఏళ్లు. ఆ తరువాత నుంచి ఆపదలో ఉన్న వారిలో అతడికి అమ్మే కనిపించేది. దాంతో రక్తదానం చేయడం అలవాటు చేసుకున్నారు. అలా ఇప్పటి వరకు 74 సార్లు రక్త దానం చేశారు. శనివారం(జూన్ 14) రక్తదాతల దినోత్సవం రోజున 75వ సారి రక్తదానం చేసేందుకు సిద్ధమయ్యారు. అరుదైన బ్లడ్ గ్రూపు కలిగిన వ్యక్తి కావడంతో ఆయనకు ఎక్కడెక్కడి నుంచో ఫోన్లు చేసేవారు. బాధితులు కోరగానే వెంటనే అక్కడకు వెళ్లిపోయేవారు. ఒంగోలు నుంచే కాకుండా హైదరాబాద్, వైజాగ్, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, చెన్నయ్ వెళ్లి రక్తదానం చేసిన సందర్భాలు ఉన్నాయి. రెడ్ క్రాస్ సంస్థలోనే 35 సార్లు రక్తదానం చేయడం విశేషం. ఇటీవల చీరాలకు చెందిన ఒక మహిళ పాపను ప్రసవించింది. పుట్టిన ఆ పాప దేహంలో రక్తం తయారయ్యే వ్యవస్థలో సమస్య ఏర్పడింది. దాంతో ఆ మూడు రోజుల పసిపాపను ఒంగోలులోని కిమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందజేశారు. అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి రావడంతో థామస్ తానున్నానంటూ ముందుకొచ్చి ఆ పసిగుడ్డు ప్రాణం నిలబెట్టారు. ఈ సంఘటన తన జీవితంలో అత్యంత సంతృప్తి ఇచ్చిందంటున్నారు థామస్.

రక్తదానం చేయడం అందరి బాధ్యత

ప్రపంచంలో ప్రతి దానికి ప్రత్యామ్నాయం ఉంది. కానీ రక్తానికి మాత్రం లేదు. రక్తం అనేది ఒక మనిషి నుంచి మరొక మనిషికి ఎక్కించాల్సిందే. ఈ రోజుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయి. శస్త్ర చికిత్సల సమయంలో అత్యవసర పరిస్థితి ఏర్పడుతోంది. అలాంటి సందర్భాల్లో సకాలంలో రక్తం దొరక్క అనేక మంది ప్రాణాలు పోతున్నాయి. ఆ పరిస్థితి ఎవరికీ రాకూడదు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాలి. సాటి మనిషి ప్రాణాలను కాపాడగలిగే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలి.

– మక్కెన థామస్, రక్తదాత